వజ్ర టౌన్‌షిప్.. దుమ్ముమయం

- వాహనాల మళ్లింపుతో ఇబ్బందులకు గురవుతున్న కాలనీవాసులు
- రోడ్డు మొత్తం ధ్వంసమై దుమ్ములేస్తోందని ఆవేదన
- సమస్య పరిష్కరించాలని విన్నపం


దుమ్మురాకుండా ఇళ్లకు కట్టుకున్న గ్రీన్ మ్యాట్


వాహనాల మళ్లింపుతో ధ్వంసమైన రోడ్డు

సూర్యాపేట అర్బన్ : హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై జనగామ క్రాస్ రోడ్డులో ఫ్లైఓవర్ నిర్మాణం జరుగుతోంది. అయితే జాతీయ రహదారిపై ఇరువైపులా వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా అంజనాపురి కాలనీ వజ్ర టౌన్‌షిప్ ముందు నుంచి వాహనాలను మళ్లిస్తున్నారు. ఇసుక ట్రాక్టర్లు, లారీలు, భారీ, అతి భారీ వాహనాలు వెళ్తుండడంతో వజ్ర టౌన్షిప్ ముందు వేసిన రోడ్డు కొన్ని రోజుల్లోనే మొత్తం పాడైపోయింది. దీంతో ఫ్లై ఓవర్ నిర్మించే కాంట్రాక్టర్ వజ్ర టౌన్‌షిప్ ముందు రోడ్డుపై డస్ట్ పోయించారు. అయితే డస్ట్ కారణంగా వాహనాలు వెళ్తున్నప్పుడు దుమ్ము విపరీతంగా లేస్తోంది. వజ్ర టౌన్‌షిప్‌లోని ఇళ్లలోకి కూడా దుమ్ము చేరుతుండడంతో ఆ కాలనీ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రోడ్డుపై నుంచి వచ్చే దుమ్ముకు అడ్డుగా ఇళ్ల ముందు గ్రీన్ మ్యాట్లు కట్టుకుంటున్నారు. దుమ్ముతో శ్వాసకోశ సంబంధ వ్యాధులు వస్తున్నాయని పలువురు ఆందోళన చెందుతున్నారు.

వాహనాల మళ్లింపు ఆపాలి



రోడ్డు నిర్మాణం చేయకుండా వాహనాలను మళ్లించడంతో ఉన్న కాస్తంత రోడ్డు పాడైపోయింది. రోడ్డుపై రాతి పౌడర్ పోయడంతో వాహనాలు వెళ్లినప్పుడు దుమ్ములేస్తోంది. కాలనీ దుమ్ముమయం అవుతోంది. వాహనాల మళ్లింపు ఆపాలి. రోడ్డు వేసిన తర్వాతనే వాహనాలను మళ్లించాలి.
– ఉస్మాన్, వజ్ర టౌన్‌షిప్

గ్రీన్ మ్యాట్లు కట్టినా ఫలితం లేదు



వాహనాల మళ్లింపుతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. దుమ్మంతా ఇళ్లలోకి చేరుతోంది. దీంతో ఇళ్లలో ఉండలేని పరిస్థితి ఎదుర్కొంటున్నాం. ఇళ్లకు గ్రీన్ మ్యాట్లు కట్టినా ఫలితం ఉండడం లేదు. పాడైపోయిన రోడ్డు స్థానంలో కొత్త రోడ్డు వేసే వరకు వాహనాల మళ్లింపును ఆపాలి.
– గాజుల సుధాకర్, వజ్ర టౌన్‌షిప్

కలిసికట్టుగా పనులు చేసుకోవాలి


వేణారెడ్డిని సన్మానిస్తున్న హమాలీలు

భానుపురి : బీహార్ హమాలీలు స్థానిక హమాలీలు, వ్యాపారులతో కలిసికట్టుగా ఉండి పనులు చేసుకోవాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. సోమవారం వ్యవసాయ మార్కెట్ యార్డులో బీహార్ హమాలీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇతర రాష్ట్రాల నుంచి 300 మంది హమాలీలు వచ్చి ఐకేపీలు, రైస్ మిల్లులు, వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో పనిచేయడం అభినందనీయమన్నారు. అనంతరం హమాలీలు వేణారెడ్డిని గజమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు యండీ. అంజద్ అలీ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాడ్గుల నవీన్, మార్కెట్ హమాలీ సంఘం మేస్త్రీ రమేష్ శర్మ, రూదల్, మనోజ్, మక్కాం పాల్గొన్నారు.

అరుణోదయ రామారావు సేవలు గొప్పవి


నివాళులర్పిస్తున్న నాయకులు

సూర్యాపేటఅర్బన్: విప్లవ సంస్కృతోద్యమ నేతగా, కళాకారుడిగా అరుణోదయ రామారావు అందించిన సేవలు గొప్పవని సీపీఐ (ఎంఎల్) జిల్లా కార్యదర్శి డేవిడ్ కుమార్ అన్నారు. అరుణోదయ రామారావు వర్ధంతి సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య, ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు శంకర్, టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పుప్పాల వీరన్న, టీపీటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు రాచూరి ప్రతాప్, ఎస్‌కే సుభాన్, రవికుమార్, యాకయ్య, ఐఎఫ్‌టీయూ నాయకులు పాల్గొన్నారు.

ఉచిత విద్య అందించేందుకు ప్రవేశ పరీక్ష


ప్రశ్నపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

సూర్యాపేటటౌన్ : తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) సూర్యాపేట జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం పీపుల్స్ ప్రోగ్రెస్ ట్రస్ట్ ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఈ ప్రవేశ పరీక్ష ప్రశ్నపత్రాలను టీఎస్ యూటీఎఫ్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు ఎన్.సోమయ్య విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చుక్కా రామయ్య సౌజన్యంతో పీపుల్స్ ప్రోగ్రెస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలలో నిరుపేద, తల్లిదండ్రులు లేని విద్యార్థులకు ఉచిత విద్య అందించేందుకు ప్రవేశ పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ యాకయ్య, జిల్లా ఉపాధ్యక్షురాలు అరుణ భారతి, జిల్లా కోశాధికారి వెంకటయ్య, పీపుల్స్ ప్రోగ్రెస్ ట్రస్ట్ పర్యవేక్షకుడు సుఖదేవ్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ


భానుపురి : చెక్కులు అందిస్తున్న రమేష్ రెడ్డి

భానుపురి : సీఎంఆర్‌ఎఫ్ పేద ప్రజలకు వరమని రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన నివాసంలో నియోజకవర్గంలోని 11 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలోనే పేదల ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. కేవలం 15 నెలల్లోనే రూ.1000 కోట్ల నిధులను పేద ప్రజల కోసం ఖర్చు చేసిందని తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు చికిత్స కోసం ఈ పథకం ద్వారా సహాయం అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట మార్కెట్ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, నాయకులు షఫీ ఉల్లా, వెలుగు వెంకన్న, శ్రీనివాస్, లబ్ధిదారులు పాల్గొన్నారు.


పెన్‌పహాడ్ : వెంకట్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పటేల్ రమేష్‌రెడ్డి, తదితరులు

మృతుడి కుటుంబానికి పరామర్శ

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని చీదెళ్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రణబోతు వెంకట్‌రెడ్డి ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. సోమవారం మృతుడి కుటుంబాన్ని తెలంగాణ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి పరామర్శించి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పిల్లల రమేష్‌నాయుడు, వల్దాసు దేవేందర్, రణబోతు శ్రీనివాస్‌రెడ్డి, ఎడ్ల వెంకట్‌రెడ్డి, గుర్రం అమృతారెడ్డి, సూదిరెడ్డి సత్యనారాయణరెడ్డి, కర్ణాకర్‌రెడ్డి, యాట ఉపేందర్, కుందూరు వెంకట్‌రెడ్డి, బెల్లంకొండ శ్రీరాములు, బిజిగ గోపి, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యాయమూర్తి మృతికి సంతాపం

చివ్వెంల : హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రియదర్శిని మృతి పట్ల సూర్యాపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం సంతాపం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా కోర్టులో సోమవారం నిర్వహించాల్సిన కేసులను మంగళవారంనకు వాయిదా వేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొంపల్లి లింగయ్య, ప్రధాన కార్యదర్శి సుంకరబోయిన రాజు, ఉపాధ్యక్షుడు గుంటూరు మధు, జాయింట్ సెక్రటరీ దావుల వీరప్రసాద్ పాల్గొన్నారు.

అందాల పోటీలు నిర్వహించొద్దు

ఆత్మకూర్ (ఎస్) : తెలంగాణ రాష్ట్రంలో జరిగే అందాల పోటీలను రద్దు చేయాలని ప్రగతిశీల యువజన సంఘం(పీవైఎల్) జిల్లా అధ్యక్షుడు నల్లగొండ నాగయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా ప్రజలను మోసగించడంలో కేసీఆర్ బాటలోనే నడుస్తుందని అన్నారు. అప్పుల్లో ఉన్న రాష్ట్రంలో అందాల పోటీలకు వందల కోట్లు ఖర్చు పెట్టడం సరికాదని తెలిపారు. మిస్ వరల్డ్ అందాల పోటీలను వెంటనే రద్దు చేయాలని, లేని పక్షంలో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి


మాట్లాడుతున్న సీఐ రఘువీర్ రెడ్డి

తిరుమలగిరి : ఇళ్ల యజమానులు, దుకాణదారులు, వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని సీఐ రఘువీర్ రెడ్డి అన్నారు. సోమవారం తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌లో ట్రాఫిక్ రూల్స్‌పై వారికి అవగాహన కల్పించారు. రోడ్లపై వ్యాపారాలు చేయడం వల్ల ప్రమాదాలు జరగడానికి అవకాశం ఉందని అన్నారు. వాహనాలను రోడ్లపై నిలుపుతుండడంతో దూరప్రాంతాలకు వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎవరైనా నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఇళ్ల యజమానులు, దుకాణదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ యాదగిరి, ఎస్ఐ వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహసీల్దార్ జాన్ మహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

బుద్ధ జయంతిని అధికారికంగా నిర్వహించాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నాగారం : రాష్ట్రంలో అత్యంత ప్రసిద్ధిగాంచిన ఫణిగిరి బౌద్ధక్షేత్రం (దమ్మ చక్కపురం) వద్ద బుద్ధ జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సోమవారం బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు కలెక్టర్ తేజస్ నందలాల్‌పవార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ ఎర్ర రాంబాబు మాట్లాడారు. ప్రభుత్వాలు మారినా గొప్ప చారిత్రక నేపథ్యం కలిగిన బౌద్ధ క్షేత్రాన్ని పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఈ నెల 12న బుద్ధ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, ఫణిగిరి బౌద్ధ క్షేత్రాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని కోరారు. మ్యూజియం ఏర్పాటు చేసి పర్యాటకులకు వసతులు కల్పించే విధంగా అభివృద్ధి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు చెరుకుపల్లి లక్ష్మణ్, జిల్లా ఉపాధ్యక్షుడు పరశురాం, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ ఇప్పించండి సారూ..


నవిలే గణేష్

ఆత్మకూర్(ఎస్): మండల పరిధిలోని ఏపూరు గ్రామానికి చెందిన నవిలే లింగయ్య, రేణుకలకు ముగ్గురు సంతానం. రెక్కాడితే కానీ డొక్కాడని పేద కుటుంబం వారిది. లింగయ్య పెయింటింగ్ పనికి వెళ్తుండగా రేణుక గ్రామంలో కూలి పనులకు వెళ్తుంది. కాగా వీరి పెద్ద కుమారుడు నవిలే గణేష్(14)కు పుట్టుకతో పోలియో వచ్చింది. అతడు నడవడం గానీ, తినడం గానీ ఒక వ్యక్తి సహకారం లేనిది చేయలేడు. గణేష్‌ను చూసుకోవడానికి కొన్ని సమయాలలో రేణుక కూలి పనులు వదిలి ఇంటి వద్దనే ఉండాల్సి వస్తుంది. అయితే గణేష్‌కు పింఛన్ కోసం 14 సంవత్సరాల నుంచి అతడి తల్లిదండ్రులు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం లేకుండా పోయింది. సదరమ్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకుందామంటే కొన్నిసార్లు ఆన్‌లైన్‌లో తీసుకోకపోవడం.. ఒకటి, రెండు సార్లు సదరమ్ కోసం క్యాంపునకు వెళ్లినా అధికారులు సర్టిఫికెట్ ఇవ్వకపోవడంతో వారు విసిగిపోయారు. తమ కుమారుడికి పింఛన్ ఇప్పించాలని అధికారుల చుట్టూ, ప్రజాప్రతినిధుల చుట్టూ, కార్యాలయాల చుట్టూ తిరుగుతూ వేడుకుంటున్నా ఎవరూ స్పందించట్లేదని లింగయ్య అంటున్నారు. పుట్టు పోలియోతో రెండు కాళ్లు, చేతులు చచ్చుబడి మాట కూడా రాని వ్యక్తికి పింఛన్ ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని గ్రామస్తులు కూడా ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమ కుమారుడికి పింఛన్ సౌకర్యం కల్పించాలని, ట్రై సైకిల్ లేదా వీల్ చైర్ ఇప్పించాలని గణేష్ తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

సభ్యత్వం నమోదు

అర్వపల్లి : కేంద్ర పభుత్వం కొత్తగా తెచ్చిన 4 లేబర్ కోడ్‌లను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు కోరారు. మండల పరిధిలోని కాసర్లపహాడ్ గ్రామంలో సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి పులుసు సత్యం, జిల్లా కమిటీ సభ్యులు శిగ శ్రీను, మచ్చ నర్సయ్య పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

మద్దిరాల : పోలుమల్ల గ్రామంలో ఆదివారం రాత్రి తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలయ్యాయి. స్థానికులు, బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పోలుమల్ల గ్రామానికి చెందిన రాగిరి ఎల్లయ్య వృత్తిరీత్యా రోజుమాదిరిగానే ఆదివారం రాత్రి తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం సూర్యాపేటకు తరలించారు.

గడ్డివాము దగ్ధం

నూతనకల్ : మండల పరిధిలోని మిర్యాల గ్రామంలో సోమవారం ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని గడ్డివాము దగ్ధమైంది. గ్రామస్తులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాల గ్రామానికి చెందిన అనంతుల లింగమల్లు తన వ్యవసాయ బావి వద్ద గడ్డివాము ఏర్పాటు చేసుకున్నాడు. సోమవారం సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. ఆ మంటలు గడ్డివాముకు అంటుకోవడంతో కాలిబూడిదైంది. ఫైర్ సిబ్బందికి సమాచారం అందించగా వారు వచ్చి మంటలను ఆర్పివేశారు.

భూభారతి చట్టంపై అవగాహన

నాగారం : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన భూభారతి చట్టంపై మండల పరిధిలోని వర్ధమానుకోటలో సోమవారం తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం సభ్యులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక సారథి జిల్లా టీం లీడర్ పాలకుర్తి శ్రీకాంత్ మాట్లాడారు. భూ సమస్యలు పరిష్కరించడానికే రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందని అన్నారు. భూమి హక్కుల రికార్డులు భూభారతి చట్టం ద్వారా రైతులకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో సాంస్కృతిక సారథి కళాబృందం సభ్యులు ఈర్ల సైదులు, గడ్డం ఉదయ్, వెన్నెల నాగరాజు, మాగి శంకర్, దప్పు ఉపేందర్, మేడిపల్లి వేణు, మద్దిరాల మంజుల, సిరిపంగి రాధ, నెమ్మాది స్రవంతి, పోతరాజు శిరీష, గ్రామస్తులు, జీపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


భూ భారతి చట్టంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సాంస్కృతిక సారథి బృందం

ఘనంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం


తిరుమలగిరిలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు

తిరుమలగిరి : తిరుమలగిరి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998–99 సంవత్సరం పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు సోమవారం మండల కేంద్రంలోని ఎస్ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని ఆనందంగా గడిపారు. అనంతరం గురువులను శాలువాలతో సన్మానించారు. చనిపోయిన ఉపాధ్యాయులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మందడి పద్మారెడ్డి, సంకెపల్లి రాంరెడ్డి, కృష్ణమూర్తి, రామచంద్రయ్య, కృష్ణమాచారి, కొమురెల్లి, దేవదాస్, ఆదిల్‌పాషా పాల్గొన్నారు.

కోడూరులో ఘనంగా సొడమ్మ జాతర


భేరీ వాయిస్తున్న సామేల్, చెవిటి వెంకన్నయాదవ్

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలంలోని కోడూరులో జరుగుతున్న సొడమ్మ జాతరకు సోమవారం ఎమ్మెల్యే మందుల సామేల్, తెలంగాణ రైతు కమిషన్ సభ్యుడు చెవిటి వెంకన్నయాదవ్ హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం యాదవులతో కలిసి భేరీలు వాయిస్తూ భక్తులను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు సామ అభిషేక్‌రెడ్డి, జిల్లా నాయకుడు గుడిపల్లి మధుకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి, చెంచల శ్రీనివాస్, వల్లపు సోమయ్య, బొర్ర వెంకన్న, నిద్ర సంపత్, మాజీ సర్పంచ్ బాబు, మోహనాచారి, ఏఎంసీ డైరెక్టర్లు సైదులు, జలేంధర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పాకిస్తానీయులను బహిష్కరించాలని వినతి


తుంగతుర్తి: వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తుంగతుర్తి : భారతదేశంలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్తానీ జాతీయులను వెంటనే బహిష్కరించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెపాక సాయిబాబా, మండల అధ్యక్షుడు నారాయణదాస్ నాగరాజు అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ కత్తుల నరేష్, బీజేపీ జిల్లా నాయకులు ఉప్పుల లింగయ్య, షేక్ రఫీ, సాయి కృష్ణ, నవీన్, వెంకన్న, సుధాకర్, మధు, నగేష్, తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల : భారతదేశంలో ఉన్న పాకిస్తానీయులను వెంటనే బహిష్కరించాలని కోరుతూ బీజేపీ మండల అధ్యక్షుడు వడ్డాణం కిరణ్‌కుమార్ సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ప్రధాన కార్యదర్శి విక్రమాచారి, ముత్తినేని రమేష్, తులసి, సతీష్, నితిన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

చివ్వెంల: భారత్‌లో అక్రమంగా నివసిస్తున్న పాకిస్తానీయులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ క్రిష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు హేదవరం అనిల్, ధరావత్ శ్రీనివాస్ నాయక్, జంపాల వెంకటేశ్వర్లు, పి.లక్ష్మణ్‌రావు, రమావత్ మంగ్యా నాయక్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ప్రచారం



అర్వపల్లి : రామన్నగూడెంలో బడిబాట ప్రచారంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

అర్వపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని రామన్నగూడెం పీఎస్ ప్రధానోపాధ్యాయుడు చిప్పలపెల్లి ధర్మయ్య చెప్పారు. సోమవారం పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తమ పాఠశాలకు రావాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నీరజ, వెంకన్న, వేమారెడ్డి, సుధారాణి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సొంత ఖర్చులతో ఆడియో తయారు చేసి..

అర్వపల్లిలోని జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు టెన్త్ ఫలితాలలో నియోజకవర్గ స్థాయిలో ప్రతిభ కనబర్చడంతో ఆ పాఠశాల పీడీ, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు పి.మల్లేష్ స్వచ్ఛందంగా టెన్త్ ఫలితాల ఆడియోను తయారుచేయించి, కొంత మంది ఉపాధ్యాయులతో కలిసి బైక్‌పై ఊరూరా తిరుగుతూ మైక్ ప్రచారం చేస్తున్నారు. సోమవారం అడివెంల, కుంచమర్తి గ్రామంలో ప్రచారం జరిపారు. పాఠశాలకు చెందిన విద్యార్థిని వర్రె శ్రావ్య టెన్త్‌లో 562 మార్కులు సాధించి నియోజకవర్గంలో టాపర్‌గా నిలిచిందని తెలిపారు. అలాగే 10మంది విద్యార్థులు 500మార్కులకు పైగా సాధించారని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మడ్డి పద్మ, ఉపాధ్యాయులు నాగన్న, వీరన్న పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రభుత్వ కళాశాలలో చేర్పించాలి

తిరుమలగిరి : పదవ తరగతి పూర్తయిన విద్యార్థులను మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించాలని జూనియర్ కళాశాల అధ్యాపక బృందం సోమవారం ఇంటింటికీ తిరిగి విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలలో ఉచితంగా నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు.

సంక్షిప్త సమాచారం

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

నాగారం : నాగారం మండల పరిధిలోని లక్ష్మాపురం గ్రామంలో శ్రీ సీతారామాంజనేయ ఆలయ నిర్మాణానికి సోమవారం భక్తులు భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితుల ఆధ్వర్యంలో గురువందనం, గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవాచకం, నవగ్రహ పూజ తదితర కార్యక్రమాలను చేపట్టారు. ఈ కార్యక్రమంలో అర్చకులు రాఘవశర్మ, ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ పందిరి మల్లయ్య, ఉపాధ్యక్షులు చాగంటి వెంకన్న, చాగంటి శ్రీనివాస్, పందిరి వెంకన్న, గండెల శ్రీనివాస్, చాగంటి వీరభద్రయ్య, చాగంటి రాజు, దేశగాని నర్సయ్య, చాగంటి సాగర్, రాజు, సత్తయ్య, అంజయ్య, మధూకర్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన

తిరుమలగిరి : మున్సిపాలిటీ పరిధిలోని మాలిపురం, అంబేద్కర్‌నగర్, అనంతారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ హరిప్రసాద్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యానికి వేగవంతంగా కాంటాలు వేయాలని నిర్వాహకులను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జాన్‌మహ్మద్, గిర్దవార్ సుజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

కల్వర్టు పనులు ప్రారంభం


పనులను ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్

అర్వపల్లి : మండల పరిధిలోని కొమ్మాల గ్రామం నుంచి కుమ్మరికుంట మీదుగా అన్నారం వెళ్లే రోడ్డులో కల్వర్టు నిర్మాణ పనులను జాజిరెడ్డిగూడెం పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్ రెడ్డి సోమవారం ప్రారంభించి మాట్లాడారు. ఎమ్మెల్యే మందుల సామేల్ మంజూరు చేయించిన రూ.10 లక్షల నిధులతో కల్వర్టు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్ డీఈ బాబూరావు, ఏఈ కుమారస్వామి, వెంకట్‌రెడ్డి, ప్రవీణ్, గంగయ్య, వీరారెడ్డి, సుధాకర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వీరేష్, విజ్జిరెడ్డి, చంద్రయ్య, స్వామి, మల్లారెడ్డి, బాబు, నర్సింహ, రాంమూర్తి, సంపత్, వెంకటయ్య పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని అనాజీపురం పీఎం శ్రీఆదర్శ పాఠశాలలో ఇంటర్‌లో మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ కోడి లింగయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోడల్ స్కూల్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులకు 40చొప్పున మొత్తం 160 సీట్లు ఉన్నాయని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి ఎటువంటి ఫీజు లేదని పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 20వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆర్థికసాయం అందజేత


ఫణిగిరిలో మృతుడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న స్నేహితులు

నాగారం : మండల పరిధిలోని ఫణిగిరి గ్రామానికి చెందిన బొంతకొల్ల సుహాసిని భర్త కిరణ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా సుహాసిని టెన్త్ బ్యాచ్ 2005–06 స్నేహితులు సోమవారం మృతుడి దశదిన కర్మకు హాజరై ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.30,000 ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మణికుమార్, సురేష్, పాషా, సతీష్, సుధాకర్, ఉపేందర్, శ్రీను, నరేష్, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

తుంగతుర్తి : రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కాంగ్రెస్ సేవాదళ్ యంగ్ బ్రిగేడ్ రాష్ట్ర అధ్యక్షుడు తెల్ల శ్రవణ్ కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో యంగ్ బ్రిగేడ్ జిల్లా అధ్యక్షుడు కాసర్ల గణేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఏ ఒక్కరికి కూడా రేషన్ కార్డు ఇవ్వలేదని అన్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రేషన్ కార్డులు ఇవ్వడంతోపాటు కార్డు కలిగిన ప్రతిఒక్కరికీ సన్న బియ్యం అందిస్తున్నట్లు తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ వ్యక్తులకు పెద్దపీట వేస్తూ భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్ర చేస్తోందని విమర్శించారు. దేశంలో భారత రాజ్యాంగాన్ని కాపాడడం కోసం రాహుల్ గాంధీ నేతృత్వంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జై సంవిదాన్ మండల కోఆర్డినేటర్ మాచర్ల అనిల్ క్యాస్ట్రో, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వీరబోయిన గంగరాజు యాదవ్, మద్దిరాల మండల కాంగ్రెస్ సేవాదళ్ యంగ్ బ్రిగేడ్ అధ్యక్షుడు తాళ్లపల్లి దామోదర్, ఉప్పుల శీను, ఉప్పల లింగయ్య, వీరబోయిన లింగమల్లు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

అర్వపల్లి : మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని గోరెంట్ల జెడ్పీహెచ్ఎస్ తెలుగు ఉపాధ్యాయుడు, సామాజిక కార్యకర్త రాచకొండ ప్రభాకర్ కోరారు. కోడూరులో జరుగుతున్న సొడమ్మ జాతరలో సోమవారం విచిత్ర వేషధారణతో కరపత్రాలను పంచుతూ ప్రచారం చేశారు. మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా స్వచ్ఛందంగా విచిత్ర వేషధారణతో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా తన ప్రచారం సాగుతోందని తెలిపారు. జాతరలో కరపత్రాలు పంచుతూ మైకు ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పోలీసు అధికారి పోగుల శ్రీను, గ్రామ యువకులు పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయుడు ప్రభాకర్